

# నీతి నిజాయితీ

ఒక ఊళ్ళో ఒక జమిందారు ఉండేవాడు. ఆయన చాలా మంచివాడు. దాన ధర్మాలలో 'ఆయనకు ఆయనే సాటి', అనీ పేరు పొందాడు. ఆయనకు ఆవులను పెంచడమంటే మహా సరదా. ఆయన పశువుల కొట్టంలో ముప్పయి ఆవులు ఉన్నాయి. అయినప్పటికీ, తనకు నచ్చిన ఆవులను యింకా కొంటూనే ఉండేవాడు.

ఒకరోజు పనిమీద పొరుగూరు వెళ్ళాడు. అక్కడ ఒక గొల్లవాడు పది మంచి, మంచి పాడి ఆవులను మేపటానికి తోలుకొని పోతున్నాడు. అందులో ఒక మంచి తెల్ల ఆవు ఉంది. దానిని చూడంగానే, జమిందారుకు, కొనాలని బుద్ధి పుట్టింది. వెంటనే, ఆ ఆవుకు తగిన ఖరీదు ఆ గొల్లవానికి చెల్లించి, తన యింటి గుర్తులు చెప్పి ఆ ఆవును, తన యింటివద్దకు తోలి పెట్టమని చెప్పి ఊరు వచ్చేశాడు.

మరునాడు ఆ గొల్లవాడు, రంగన్న అనే బీద కుర్రవానిని పిలిచి, "ఈ ఆవును ఫలానా జమిందారుగారి, పశువుల కొట్టానికి చేర్చిరా" అని, ఆ జమిందారి యింటి గుర్తులు చెప్పి, ఆ ఆవును వాడితో కూడా పంపాడు. పాపం ఆ కుర్రవాడు చిన్నవాడు. ఆవు, తిన్నగా వాడు చెప్పినట్లు వినక, తిప్పలు పెట్టడం మొదలు పెట్టింది. ఎలాగో కష్టపడి, దానితో కూడా అవస్థలు పడుతూ, జమిందారి ఊరి పొలిమేర వరకూ తీసుకువచ్చాడు. కానీ, ఊరునీ, అక్కడ ఉండే ఎక్కువమంది జనాన్నీ, చూడంగానే ఆవు బెదిరిపోయింది. రంగన్న తాడును ఎంతలాగి పట్టుకున్నా, ఆగకుండా గింజుకోసాగింది.

పాపం రంగన్నకి ఏం చెయ్యాలో తోచింది కాదు. పోనీ ఎవరినైనా తెలుసున్న వాళ్ళని సహాయం అడుగుదామన్నా, తనకు తెలుసున్న వాళ్ళెవరూ కనిపించలేదు. ఆవు వెనక్కి పోవటానికి గింజుకుంటోంది. ఏం చెయ్యాలో బోధపడక, రంగన్న, ఆ ప్రక్కగా పోతున్న పెద్దమనిషిని పిలిచాడు. "అయ్యా, యీ ఆవు

రచన : జి. రామలక్ష్మి



నాకు లొంగటంలేదు. యిది యీ వూరి జమిందారుగారు కొన్నారు. వాళ్ళయింటికి వెళ్ళి, దీనిని జమిందారుగారి పశువుల కొట్టానికి చేర్చిరమ్మని మా యజమాని పంపాడు. ఎలాగో కష్టపడి, యిక్కడి వరకూ, తీసుకురాగలిగాను. దయవుంచి నాకు కాస్త సహాయం చేస్తే, ఆయన నాకు యిచ్చే కూలిలో మీకూ సగము యిస్తాను. కాదనకండి, ఇప్పటికే బాగా ఆలస్యమయి పోయింది. జమిందారుగారు, ఈ ఆవుకోసం ఎదురు చూస్తుంటారు." అని బ్రతిమిలాడాడు.

ఆ పెద్దమనిషి ఎవరోకాదు. ఆ అవును కొన్న జమిందారే. అవును యింకా తీసుకు రాకపోతే, ఒకవేళ యిల్లు తెలీలేదేమోనని అవురాకకై ఎదురు చూస్తూ, ఊరి పొలిమేరవరకూ వచ్చాడు. అంతకు ముందెప్పుడూ రంగన్న, జమిందారుని చూడలేదు. అందువలన అవును కొన్న యజమాని ఆయనేనని, తెల్సుకోలేకపోయాడు.

రంగన్న అవస్తలు చూసేసరికి, జమిందారుకి, జాలేసింది. వెంటనే రంగన్నకు సహాయం చేసి, అవును జమిందారు పశువుల కొట్టానికి చేర్చాడు.

తర్వాత రంగన్నకు తెలియకుండా, జమిందారు దొడ్డిగుమ్మాన లోపలికి వెళ్ళి తన నౌకరు ద్వారా, ఐదు బంగారు నాణెములను రంగన్నకి యిచ్చిరమ్మని పంపాడు

ఆ నౌకరు ఒట్టి మోసగాడు, పచ్చిదొంగ "యింతోటి అవును తోలుకొచ్చినందుకు, ఐదు బంగారు నాణాలు యివ్వాలా ?. తను ఏవి యిచ్చినా మళ్ళీ, జమిందారు ఆ కుర్రవాడిని అడగబోతాడా ? అయినా యిలాంటి మోసాలు ఎన్నిసార్లు చెయ్యలేదూ !" అని అనుకుని, బంగారు నాణేలు తను దాచుకుని, ఐదు వెండి నాణాలను రంగన్నకి యిచ్చి పంపేసాడు.

ఈ లోపల జమిందారు, ఏమీ తెలియనివానిలాగ, ఊరి పొలిమేరకు వెళ్ళి, రంగన్న కొరకు ఎదురు చూస్తూ, నిలబడ్డాడు.

ఇదు వెండి నాణాలన్నీ పట్టుకునీ రంగన్న జమిందారు వద్దకు వచ్చాడు. "అయ్యా మీమేలు నేను జన్మలో మరువలేను. యిదిగో ఐదు వెండినాణాలు నాకు కూలిగాముట్టాయి. యివిగో, మీకు మూడు నాణాలు, నాకు రెండు నాణాలు, తీసుకోండి'' అన్నాడు మూడు వెండినాణాలను జమిందారు చేతిలో పెడుతూ.

ఆ వెండి నాణాలను చూసేసరికి జమిందారుకి ఆశ్చర్యమేసింది. తనుయిచ్చినది బంగారు నాణేలు, రంగన్న దగ్గర ఉన్నవి వెండి నాణేలు, యిదంతా నౌకరు చేసిన మోసమే అయివుంటుంది అనీ మనసులో అనుకునీ, "అదేమిటిరా నాకు. మూడు నాణేలు యిస్తున్నావు?" అన్నాడు ఆశ్చర్యంగా, "అవును, న్యాయం ప్రకారం మీకు మూడు నాణేలు రావాలి" అన్నాడు.

''అదెలాగురా?'' అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును, మీ సహాయమే లేకుంటే ఆ ఆవు జమిందారుగారి యింటివరకూ వచ్చేదికాదు. తిరిగి, తాడులాక్కుని వెనక్కి వెళ్ళిపోయేది. అలాంటి సమయంలో, మీరు నాకు సహాయం చెయ్యకుంటే, నాగతి ఏమయి ఉండేది? అందుకనీ, మీకు మూడునాణాలు, నాకు రెండునాణేలు వస్తాయి" అన్నాడు.

జమిందారుకు, రంగన్నకి ఉన్న నీతి-నిజాయితీనిచూస్తే, జాలీప్రేమా కలిగాయి. రంగన్నని వెంటబెట్టుకునీ, తన యింటికి వెళ్ళాడు. నౌకరుని పిలిచి, గద్దించి, అడిగేసరికి, వాడు చేసిన మోసం అంతా ఒప్పుకుని, ఐదుబంగారు నాణేలను తీసుకొచ్చి యిచ్చేసాడు.

జమిందారుకు, తన నౌకరుపైన పట్టరాని కోపమూ. రంగన్న నీతీ-నిజాయితీపైన అమితమైన ప్రేమ కలిగాయి. వెంటనే ఆ నౌకరును, పనినుండి తొలగించి, బయటికి తరిమేసాడు. రంగన్నను తనఇంట్లోనే ఉంచుకునీ, మంచిబట్టలు, అవీకుట్టించి, మంచిగా, చదువూ సంధ్యా చెప్పించాడు జమిందారు.

